క్లుప్తంగా

అమరవీరులకు నివాళులు



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: భారత విప్లవోద్యమంలో అమరులైన వారికి పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక స్థూపం వద్ద గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. కమలాపూర్ దినోత్సవం జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. చారుముజుందార్, తామాడ గణపతి స్థూపాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు దాసరి శ్రీరాములు, దున్న గోవిందరావు, పోతనపల్లి ధర్మారావు, విప్లవ సానుభూతిపరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి



ఈఈకి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆదిఆంధ్రావీధిలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈఈ శంకరరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. సబ్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న తమ ప్రాంతానికి నిత్యం లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని స్థానికులు వై.శివరావు, వై. వెంకటరావు, పి.రామారావు, డి.వైకుంఠరావు తదితరులు విన్నవించారు.

ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపిక



బత్తుల సునీత

కంచిలి: డోలగోవిందపురం పంచాయతీ రేఖాదేవిపురం గ్రామానికి చెందిన బత్తుల సునీత అనే యువతి గురువారం విడుదలైన ఫలితాల్లో మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికైంది. ఇందులో ఐబీపీఎస్ కెనరా బ్యాంకు క్లర్క్, ఎస్‌బీఐ క్లర్క్, ఎస్‌బీఐ అప్రంటీస్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందరావు, మీనా హర్షం వ్యక్తం చేశారు.

ఫెలోషిప్ కోర్సులో ఫస్ట్‌ర్యాంక్



డాక్టర్ సుష్మా

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన డాక్టర్ సుష్మా ఆల్ ఇండియా కాలేజ్ పిడియాట్రిక్ కామన్ ఎంట్రెన్స్ సబ్ స్పెషాలిటీ ఫెలోషిప్ కోర్సులో జాతీయ స్థాయి లో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, వైద్యులు అనురాగ్, గోవింద్, ఉషారాణిలు సుష్మకు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న గ్రామంలో అడ్డువాసవీధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మహిళలు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో ఉమారుద్ర కోటేశ్వరస్వామి, కుమారస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదానంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



అవగాహన కల్పిస్తున్న సీఐ

మందస : మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల విలువైన జీవితాలు కోల్పోతున్నారని కాశీబుగ్గ సీఐ ఎం.తిరుపతిరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మందస బస్టాండ్‌లో గురువారం అవగాహన కల్పించారు. సారా, గంజాయి వంటి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

జీడిపిక్కల కొనుగోలుకు.. మోక్షమెప్పుడో?

- కొనసాగుతున్న పరిశ్రమల బంద్
- పిక్కల కొనుగోలుకు ముందుకురాని వ్యాపారులు
- అమ్మకాలకు ఎదురుచూస్తున్న రైతులు

పలాస:

జీడి పరిశ్రమల యజమానులు ఈ నెల 2 నుంచి పలాసలో పరిశ్రమలను నిరవధికంగా బంద్ చేపట్టడంతో జీడి రైతులు కుదేలవుతున్నారు. ఉద్దానం ప్రాంతంలో పండిన జీడి పిక్కలను అమ్ముకోవడానికి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏడాదికోసారి వచ్చిన ఈ పంటే వారి జీవనాధారం. అటువంటి పంటను మార్చి నుంచి మే వరకు జీడి తోటల్లో ఎండనకా వాననకా ఇంటిల్లిపాదీ పిక్కలను సేకరించి వాటిని ఎండలో ఆరబోసి చల్లారిన తర్వాత వాటిని బస్తాల్లో వేసి భద్రం చేశారు. గ్రామాల్లోకి ఎప్పుడు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. మేలో 80 కిలోల బస్తా మార్కెట్‌లో రూ.13500 ఉండటంతో కొన్ని గ్రామాల్లో పిక్కలు కొనుగోలు జరిగాయి. అయితే వ్యాపారుల మధ్య పోటీ ఏర్పడి ఇంకా పిక్కల రేట్లు పెరుగుతాయని గ్రహించిన పలాసకు చెందిన కొందరు బడా వ్యాపారస్తులు ఎక్కడ తమ లాభాలు తగ్గిపోతాయోనని పలాస కాష్యూ అసోసియేషన్ తరఫున జీడి పరిశ్రమలను బంద్ చేయాలని పిలుపునిచ్చారు. దీంతో మార్కెట్ పూర్తిగా స్తంభించిపోయింది.

ఎవరి వాదన వాదే..

బంద్‌కు వ్యాపారులు చెప్పిన కారణం జీడి పప్పు కొనుగోలు కావడం లేదని, అందుకు పరిశ్రమలను బంద్ చేయక తప్పడం లేదని అంటున్నారు. జీడి పప్పులు నిల్వలు పేరుకుపోయి, కొనుగోలు కావడం లేదన్నది పక్కన పెడితే పలాసలో జీడి పప్పు ధరల్లో మాత్రం ఎటువంటి తేడా లేదు. వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి జీడి పిక్కల ధరలను తగ్గించుకోవడానికి డ్రామా ఆడుతున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. మొత్తానికి ఈ పరిశ్రమల బంద్ వల్ల జీడి కార్మికులకు ఉపాధి సమస్యతో పాటు ఉద్దానం జీడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలాస పరిసర ప్రాంతాల్లో సుమారు 300 జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి పలాస,ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఉద్దానం గ్రామాల రైతుల నుంచి జీడి పిక్కలు కొనుగోలు చేసి తీసుకొస్తుంటారు. ఈ పరిశ్రమల్లో సుమారు 20 వేలకు పైగా కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. తాజా బంద్ వల్ల అటు జీడి రైతులకు, ఇటు కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణమే జీడి పరిశ్రమలను తెరవాలని, జీడి పిక్కలను కొనుగోలు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



మూత పడిన జీడి పరిశ్రమ

పిక్కలు కొనడానికి డబ్బుల్లేవు..



జీడి పరిశ్రమల్లో ఉత్పత్తయిన జీడి పప్పు అమ్మకాలు కావడం లేదు. మరోవైపు నిల్వలు పేరుకుపోయాయి. ప్రస్తుతం జీడి వ్యాపారుల వద్ద డబ్బుల్లేవు. అందుకే జీడి పిక్కలు కొనుగోలు చేయడం లేదు. తప్పని పరిస్థితులో జీడి పరిశ్రమలను బంద్ చేశాం. తర్వాత పరిస్థితుల బట్టి ధరలు ఆధారపడి ఉంటాయి.

– మల్లా శ్రీనివాసరావు, పలాస కాష్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, పలాస

ధర తగ్గించేందుకే..



జీడి పిక్కల ధరను తగ్గించాలన్నదే వ్యాపారుల ఆలోచనగా కనిపిస్తోంది. దీని వల్ల రైతులు కారుచౌకగా అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బస్తాకు రూ.16000 ధర నిర్ణయించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర చెల్లిస్తున్నారు. జీడి పంటకు కూడా తగిన గిట్టుబాటు ధర చెల్లించాలి.

– తెప్పల విజయకుమార్, జీడి రైతాంగ కమిటీ జిల్లా కన్వీనర్, మాకన్నపల్లి, పలాస మండలం

ఉపాధి లేక ఇబ్బందులు..



జీడి పరిశ్రమలు బంద్ కావడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ జీడి పరిశ్రమలే మాకు ఆధారం. పది రోజులుగా పనుల్లేవు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు మావి. ఎప్పుడు పరిశ్రమలు తెరుస్తారా? అని ఎదురు చూస్తున్నాం. ప్రతి ఏటా ఇదే నెలలో ఎందుకు ఇలా బంద్ చేస్తారో అర్థం కావడం లేదు.

– సవర వాణి, జీడి కార్మికురాలు, పెంటిభద్ర, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ

అందరికీ ఉపాధి పనులు



గ్రామసభలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ మోహనరావు

సాక్షి ఎఫెక్ట్...

కవిటి: 'ఉపాధి లేక ఇబ్బందిపడుతున్నాం' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఉపాధి హామీ పథకం సిబ్బంది స్పందించారు. చిన్నకర్రి వానిపాలెంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ టి.మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో 249 హౌస్‌హోల్డ్స్ ఉండగా వీరిలో 219 మందికి జాబ్‌కార్డ్స్ ఉన్నాయన్నారు. వీరిలో 192 మందికి తక్షణమే పనులు కల్పిస్తున్నామన్నారు. కొత్త వారికి సైతం కార్డులు అందిస్తామన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: స్థానిక మెట్టవీధికి చెందిన వివాహిత గొడు గీత(34) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. గీత ఈ నెల 9న కడుపు నొప్పి భరించలేక ఫ్యాన్ దూలానికి ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమె భర్త సోమేష్ పాన్‌షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి అవకతవకలపై విచారణ జరపాలి



తీర్మానం చేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం : ఉపాధి పనుల్లో అధిక బిల్లులు ఇప్పిస్తామంటూ కొందరు సాంకేతిక సహాయకులు దొంగ మస్టర్లు వేయడంతో పాటు వేతనదారుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న వైనంపై విజిలెన్స్ విచారణ జరపాలని పలువురు సభ్యులు కోరారు. గురువారం నందిగాం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన ఎంపీడీఓ కుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కర్లపూడి పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల రైతులకు విత్తనాలు ఇవ్వడం లేదని, విత్తనాల పంపిణీకు ప్రజాప్రతినిధులకు కాకుండా తెలుగుదేశం కార్యకర్తలతో చేయిస్తున్నారని తమిరె రాజు వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మను నిలదీశారు. రేషన్ కార్డులో మార్పులు చేర్పులు, అన్నదాత సుఖీభవ, కౌలు రైతుల సాగుదారు హక్కుపత్రాలు, ఇంటింటికీ రేషన్ సరుకుల నిలిపివేత తదితర సమస్యలపై సభ్యులు నిలదీశారు. అనంతరం ఎంపీపీ శ్రీరామమూర్తి మండలంలో ఉపాధి హామీ పనులు, సొమ్ముల వసూలుపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, ఈఓపీఆర్‌డీ రాజారావు, డీటీ రామారావు, యర్ర చక్రవర్తి, పోలాకి మోహనరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాలల సంక్షేమమే లక్ష్యం



న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాధురి

కాశీబుగ్గ: బాలలు ఉండాల్సింది బడిలో తప్ప పనిలో కాదని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి అన్నారు. గురువారం కాశీబుగ్గ బాలసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డు లేని వారందరికీ ఆధార్ కార్డు జారీ చేసేందుకు న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా బాలలు ఆపదలో గానీ, పనుల్లో గానీ కనిపిస్తే 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.కె.ఆర్.పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, ట్రెజరర్ వి.రవికుమార్, లోకేష్, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంఈఓ శ్రీనివాస్, పారా లీగల్ వలంటర్ సునీల్‌కుమార్, బాలసదన్ ఇన్‌చార్జి సునందా దేవి పాల్గొన్నారు.

తెలుగు మీడియం కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కూర్మారావు

పలాస: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలని గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు. పలాస మండలం రంగోయి గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడుతున్న రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకపోవడం విచారకరమన్నారు. ఏ రాష్ట్రంలో లేని దుస్థితి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా నడపాలని కోరారు. తెలుగుభాషా పీఠం ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాపీఠం ప్రతినిధులు జి.కామరాజు, నల్ల జయశంకర్, ఎస్.సోమలయ్య, దున్న సోమేశ్వరరావు, రాపాక సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో సామూహిక అక్షరాభ్యాసాలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఆదిఆంధ్రా వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ నేతృత్వంలో పలువురు చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాధవరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది

పలాస: పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. ఆస్పత్రితో పాటు శివాలయం తదితర ప్రాంతాల్లో గురువారం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సి.హెచ్.సి. ఆదెమ్మ, పి.హెచ్.ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు రిషికేశ్వరరావు, ఈశ్వరమ్మ, మేరీ బాయి, రాజేశ్వరి, త్రివేణి, నిహారిక, లీలావతి, రాజమ్మ పాల్గొన్నారు.

కొత్త విద్యార్థులకు స్వాగతం



తోటూరులో విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్న ఉపాధ్యాయులు



పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో బడిబాట ర్యాలీలో చిన్నారులు

ఇచ్ఛాపురం రూరల్: బడులు పునఃప్రారంభం కావడంతో గురువారం సందడి వాతావరణం నెలకొంది. కొత్త విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. మండపల్లి తోటూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి సుహాశ్‌చంద్, ఉపాధ్యాయులు విద్యార్థులకు 'బ్యాక్ టు స్కూల్' అంటూ నేమ్ బోర్డుతో ఆహ్వానం పలికారు.

– కవిటి: బడి ఈడు కలిగిన పిల్లలంతా ప్రభుత్వ బడిలో చేరాలని పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో ప్రాథమిక పాఠశాలలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వబడిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం దేవదాస్ బెజ్జిపల్లి కోరారు.

నేడు జీడి కార్మికుల సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల తో పాటు పరిసర ప్రాంత జీడి కార్మికుల సమస్యలపై శుక్రవారం పలాస కార్మిక సంఘ భవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక నాయకులు, కార్యవర్గ సభ్యులు, జీడి కార్మికులు హాజరై సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కవిటి: మండలంలోని జాతీయ రహదారిపై రెండు బొలెరో వాహనాల్లో గురువారం వేకువజామున 2 గంటల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న వాహనాలను కవిటి పోలీసులు అడ్డుకున్నారని ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. రెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి ఒడిశాలోని గొలంత్ర నుంచి ఏపీలోని తిలారు సంతకు తరలిస్తుండగా వీటిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. 14 గేదెలను కొత్తవలసలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అప్పగించామన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు ఎస్.ఏ.ఎస్.రాజు, వేణుగోపాల్, గోపాలకృష్ణ తదితరులు రాసిన ఫైనాన్సియల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని గురువారం కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆర్థిక విభాగంలో సాంకేతికత సాయంగా ఈ పుస్తకం ఉపయోగపడుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు.

16లోగా ఆదర్శ పాఠశాలలో చేరాలి

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్, ఆరో తరగతిలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 16లోపు అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపల్ డి.వైకుంఠరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేనిపక్షంలో జాబితాలో తర్వాత ఉన్న వారికి సీటు కేటాయిస్తామని స్పష్టం చేశారు. 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్ల కోసం ఈ నెల 24న పాఠశాల ఆవరణలో పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9032220333 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'సాక్షి'కి న్యాయవాదుల సంఘీభావం

టెక్కలి: ఎచ్చెర్లలోని సాక్షి యూనిట్ కార్యాలయంపై ఇటీవల దాడి జరిగిన నేపథ్యంలో టెక్కలికి చెందిన న్యాయవాది, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగుపురం మోహన్‌రావు, మరి కొంతమంది న్యాయవాదులు గురువారం సంఘీభావం తెలిపారు. సాక్షి యూనిట్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.వి. వివేకానంద, ఎస్.దివాకర్, ఎ.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనంతా కక్షసాధింపు చర్యలే



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి : కూటమి ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజల నడ్డివిరిచి నడిరోడ్డున పడేశారని టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఏడాది కూటమి పాలన పై గురువారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వక పోగా, అందరిపైనా కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కోటబొమ్మాళి మండల పార్టీ కన్వీనర్ ఎస్.హేమసుందర్‌రాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ప్రతీ సారి జిల్లాలో కింజరాపు కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందుతున్నారని, తమ వంతుగా ఒక్క శాశ్వతమైన అభివృద్ధి కార్యక్రమం చేశారా అని ప్రశ్నించారు. నియోజకవర్గ స్థాయి యువజన విభాగం అధ్యక్షుడు చిన్ని జోగారావు, సంతబొమ్మాళి మండల కన్వీనర్ బుడ్డ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది పాలనలో ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. సమావేశంలో బి.మధు, డి.రామకృష్ణారెడ్డి, పి. వెంకటరావు, కె.సంజీవ్, కె.జీవన్,ఎస్.జనార్దన్‌రెడ్డి, పి.వైకుంఠరావు, ఆర్.మురళీరెడ్డి, పి.నీలకంఠం, డి.మదీన్, బి.రాజేష్, బి.కార్తీక్, పి.రమణబాబు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న దాత ఇరోతు హేమంత్

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించడంతో గురువారం మాజీ ఎంపీటీసీ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఇరోతు హేమంత్ అభినందిస్తూ తన సొంత ఖర్చులతో బ్యాగ్‌లు, పుస్తకాలు అందించారు. అదే గ్రామానికి చెందిన బొంగు బాబూరావు ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం ముగ్గురు విద్యార్థులకు రూ.1116 చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రెయ్యి రుద్రమూర్తి, వార్డు సభ్యుడు వాసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



జశ్వంత్ సాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందిగాం: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఎంఈఓ ఎ.చిన్నారావు అన్నారు. లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో చదివి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన బాలక జశ్వంత్ సాయిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందుతోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలకు సర్కారు బడుల్లోనే చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, పీఎంసీ చైర్మన్ చమళ్ల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాప్ నిర్మాణంపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు అందిస్తున్న గ్రామస్తులు

కవిటి: కవిటి సినిమా హాల్ రోడ్డులోని ఆర్అండ్‌బీ స్థలంలో మెడికల్ షాప్ నిర్మించి, కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్న ఆశిష్ మెడికల్ షాప్ లైసెన్స్‌ను రద్దు చేయాలని గొండ్యాలపుట్టుగకు చెందిన మరిడి బాలరాజుతో పాటు మరికొందరు గురువారం తహసీల్దార్ మురళీమోహనరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో అందరికీ కష్టాలే

- కంచిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఇంటింటికీ రేషన్ రద్దుతో లబ్ధిదారులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే తీసుకొచ్చే వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటివరకు అమలు చేసిన ఉచిత గ్యాస్ పథకంలో ఒక్క సిలిండర్‌ను మాత్రమే ఇవ్వగా, అందులో ఇంకా చాలా మందికి అకౌంట్లలో డబ్బులు జమకాలేదన్నారు. ఇప్పుడు తల్లికి వందనం పథకం ఎంతమందికి వర్తింపజేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

తాగునీటి సమస్య..

కంచిలిలో ఇంటింటికి నీటి సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జేజేఎం పథకం అమలు చేయడం లేదని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ లండ లక్ష్మి ఆరోపించారు. సోంపేట నుంచి కేసరపడ మీదుగా కుంబరినౌగాంకు ఆర్టీసీ బస్సు సక్రమంగా సర్వీసు జరగక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేసరపడ ఎంపీటీసీ మెండ హేమావతి ప్రకాష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రేషన్ సరుకులను డిపో వద్దకే వెళ్లి తీసుకోవడం దూరప్రాంత లబ్ధిదారులకు ఇబ్బందికరంగా ఉందని ఎంపీపీ పేర్కొన్నారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీఓ వి.తిరుమలరావు, తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, సూపరింటెండెంట్ రమణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.